క్లుప్తంగా

సంఘం అభివృద్ధి కోసమే చైర్మన్‌గా రావూరి

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చైర్మన్‌గా రావూరి సైదబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వైస్ చైర్మన్ రావేళ్ల శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అవకాశం ఉన్నప్పటికీ సైదబాబుకు డీసీసీబీ చైర్మన్ అయ్యే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా ఉన్న నేతను అప్పటి మంత్రి సూచనలతో బీసీలకు చైర్మన్ వస్తుందని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని తెలిపారు. దీంతో అవిశ్వాసం పెట్టి సైదబాబును ఎన్నుకున్నామని వివరించారు.

ఎస్ఎఫ్ఐ నాయకుడిపై దాడి హేయం

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఎస్ఎఫ్ఐ నాయకుడిపై జరిగిన దాడి గర్హనీయమని సంఘం జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడిపై దాడికి నిరసనగా గురువారం ఖమ్మంలోని మహిళా డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో సంఘ మహాసభలు నిర్వహిస్తున్న సమయంలో తమ సంఘ నాయకులపై ఏబీవీపీ నాయకులు కొంత మంది దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, రాగిణి, అంజలి, నిఖిత, స్వాతి, మైథిలి, కృష్ణవేణి, తరుణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి

కామేపల్లి: ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరునాయక్ అన్నారు. గురువారం మండలంలోని గోవింద్రాల జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో టీఎస్‌టీటీఎఫ్ మండలాధ్యక్షుడు మాలోత్ రమేష్ అధ్యక్షతన టీఎస్‌టీటీఎఫ్ క్యాలెండర్లను ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈరునాయక్ మాట్లాడుతూ.. పీఆర్సీ ఫిట్మెంట్ వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. నోడల్ అధికారి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి లింగనాయక్, నాయకులు సీతారాములు, దేవాసింగ్, భాస్కర్, సోమ్లా, సత్యం, నాగేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న జావీద్

నేలకొండపల్లి: ముస్లిం యూత్ కమిటీ సభ్యులు సంఘం బలోపేతంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టాలని ముస్లిం కమిటీ నాయకులు మహమ్మద్ జావీద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నేలకొండపల్లి పట్టణ ముస్లిం యూత్ కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్, ఉపాధ్యక్షుడిగా రఫీ, టౌన్ సెక్రటరీగా షేక్ ఖాదర్‌బాబా, కోశాధికారిగా షేక్ షఫీ, కమిటీ సభ్యులుగా షేక్ అబ్దుల్, షేక్ ఫరీద్, షేక్ ఇమ్రాన్, షేక్ ఇర్ఫాన్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. యూత్ ఆదర్శంగా నిలవాలని సూచించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరు పేరు భైరవకోన
వినోద	సుందరం మాస్టర్
సాయిరాం	సిద్ధార్థ రాయ్
ఆదిత్య	భ్రమయుగం
శ్రీనివాస	ఈగల్
సుందర్	హను-మాన్

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	56		20
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	56	చుక్కకూర	3
బీర	46		20
దొండ	40	తోటకూర	2
పొట్లకాయ	40		10
నాటు చిక్కుడు	96	గోంగూర	3
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	36		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	54		30
క్యారెట్	28	పుదీన	1
క్యాప్సికం	60		20

\-ఖమ్మం వ్యవసాయం

స్వయంభూగా వెలసి..

భక్తుల కొంగుబంగారంగా జీళ్లచెరువు శ్రీనివాసుడు

- దాతల సహకారంతో ఆలయాభివృద్ధి
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. రేపు కల్యాణం
- ప్రతీ శనివారం అన్నదానం



జీళ్లచెరువులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం

కూసుమంచి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జమలాపురం తరువాత జీళ్లచెరువులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాచుర్యం పొందింది. ఈ ఆలయానికి మండలంతో పాటు ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన భక్తులు వస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామి వారిగా జీళ్లచెరువు ఆలయాన్ని భక్తులు కొలుస్తున్నారు. స్వామి వారి దీవెనలు అందుకుంటున్నారు. ఖమ్మం-సూర్యాపేట రహదారి పక్కన జీళ్లచెరువులో ఉన్న ఈ ఆలయం భక్తులకు వరంగా మారింది.

స్వయంభూగా వెలసిన స్వామివారు..

జీళ్లచెరువు గుట్టపైన కొలువున్న స్వామివారు స్వయంభూగా వెలసినట్లు భక్తులు చెబుతున్నారు. 1964 డిసెంబర్ 31న స్వామివారు గుట్టపై వెలిశాడని, కూసుమంచి మండలం, అగ్రహారం గ్రామానికి చెందిన నలజాల నాగయ్య అనే భక్తుడు కలలోకి వచ్చి తాను గుట్టపై వెలిశానని తాను భక్తులకు దర్శనం ఇస్తానని చెప్పినట్లు ప్రచారం సాగడంతో గుట్టపై పుట్ట రూపంలో వెలిసిన స్వామి వారిని నాటి నుండి చలువ పందిరి కింద ఉంచి భక్తులు కొలిచినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది కాలానికి స్వామి వారు కలలోకి వచ్చిన నలజాల నాగయ్య అనే భక్తుడు ఇతర భక్తుల సహకారంతో గుట్టపై స్వామివారికి గుడిని నిర్మించాడు. అలా భక్తులతో విరాజిల్లుతుండగా 1967 లో దేవాదాయ శాఖ ఆధీనంలోకి ఆలయాన్ని తీసుకుని పూజా కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి నాడు స్వామి వారి బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తుంటారు. వైకుంఠ ఏకాదశి దసరా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆలయంలో దాతల సహకారంతో ప్రతీ శనివారం భక్తులకు ఉచిత అన్నదానం చేస్తున్నారు.

భక్తుల సహకారంతో అభివృద్ధి..

భక్తుల కోర్కెలు స్వామి వారు తీర్చుతుండగా వారు కూడా ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా 1975లో గోపురం నిర్మాణం 2000లో ఆలయంలో వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ తాయారు, ఆండాళ్లమ్మ (గోదాదేవి), గరుడ హనుమంతుడి విగ్రహాల ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేశారు. 2009 లో మహామండపం నిర్మించారు. 2013లో గుట్టపైకి ఘాట్‌రోడ్ (సీసీ రహదారి) నిర్మించారు. ఇలా ఆలయం భక్తుల సహకారంతో అభివృద్ధి చెందుతూ వస్తుంది. ఖమ్మంకు చెందిన భోగ శ్రీనివాస్ అనే భక్తుడు ఆలయంలో స్వామి వారి కల్యాణానికి, భోజనాలు చేసేందుకు సుమారు కోటి వ్యయంతో భవన నిర్మాణం చేశారు. ఇలా అనేకమంది భక్తులు తమవంతు సాయంగా అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. ఆలయంలో అనేక వసతులు సమకూరుస్తున్నారు.



స్వామివారి మూలవిరాట్

24న స్వామివారి కల్యాణం..

ఆలయంలో ఈనెల 20 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా 24న స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు చేపట్టారు.



ఆలయంలో దాత నిర్మించిన కల్యాణ మండపం



స్వామి వారి కల్యాణ మహోత్సవం(ఫైల్)

అభివృద్ధికి సహకరించాలి



జీళ్ల చెరువు వెంకటేశ్వరస్వామి భక్తులకు కొంగుబంగారం అయ్యాడు. ఏ కోర్కెలు కోరినా స్వామి వారు తీరుస్తారని నమ్మకం. ఈ ఆలయం గతం కంటే ఇటీవల భక్తుల సహకారంతో అభివృద్ధి చెందుతుంది. ఇంకా అనేక పనులు చేపట్టాల్సి ఉన్నందున భక్తులు మరింత సహాయాన్ని అందించాలి.

\- బూర్లె వీరబాబు, ఆలయ చైర్మన్

మత్తు పదార్థాల సరఫరా అరికట్టాలి



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గంజాయి, మత్తు పదార్థాల సరఫరాను అరికట్టి యువతను కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ కోరారు. ఈ మేరకు పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సునీల్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. విద్యాలయాలను అడ్డాగా చేసుకొని విక్రయదారులు విద్యార్థులు, యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కొందరికి మత్తు పదార్థాలు అలవాటు చేస్తుంటే మరికొందరిని మత్తు పదార్థాల రవాణాకు ఉపయోగిస్తున్నారన్నారు. ఇప్పటికే గంజాయి విక్రయిదారులు విద్యాలయాలు, హాస్టల్స్ ను అడ్డాలుగా మలుచుకుంటున్నారన్నారు. తక్షణమే జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి విద్యాలయాల్లో నిఘా పెంచి విద్యాలయాల్లో స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని కోరారు.

27న కూసుమంచికి విజయ సంకల్ప యాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూసుమంచి: నరేంద్ర మోదీని మరోసాని దేశ ప్రజలు ప్రధాన మంత్రిగా కోరుకుంటున్నారని బీజేపీ నాయకులు, పాలేరు అసెంబ్లీ పరిశీలకులు కనాగాల వెంకట్రామయ్య అన్నారు. శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి అధ్యక్షతన పాలేరులో జరిగిన పార్టీ పాలేరు అసెంబ్లీ స్థాయి కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మరోమారు నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఈ నెల 27న కూసుమంచికి చేరుకుంటుందన్నారు. బీజేపీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ రోడ్‌షోలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం విజయసంకల్ప యాత్ర పోస్టర్‌లను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి మండల అధ్యక్షులు బజ్జూరి మల్లారెడ్డి, నాయకులు నరికంటి వీరభద్రం, గడ్డం వెంకటేశ్వర్లు, హటియానాయక్, హనుమంతరావు, కృష్ణారావు, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆజాద్, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదేళ్లగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణను ప్రేరేపిస్తూ మనువాద సిద్ధాంతాన్ని అమలుపరచడంలో భాగంగా నూతన జాతీయ విధానం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అఖిల భారత విద్యార్థి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి ప్రభాకరచారి, భారత్ బచావో విద్యార్థి నాయకులు శ్రావణ్, గణేష్, ప్రశాంత్, సనత్, నాగరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవనంలో నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 28 నుండి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, దూర ప్రాంతాల నుండి పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పవన్, గోపి, నరేష్, సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాంనారాయణతో మందకృష్ణ, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకొని కోలుకుంటున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టికోల రాంనారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పరామర్శించారు. గురువారం ఖమ్మంలోని రాపర్తినగర్ జర్నలిస్టు కాలనీలో గల ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాసరావు, నాయకులు పురుషోత్తం, కల్యాణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి శ్రీ మురళీకృష్ణ గొర్రెల పెంపకందారుల పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్లను స్వీకరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సిహెచ్.రవికుమార్ నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు ఏడుగురు నామినేషన్లు వేశారు. సొసైటీలో ఏడు డైరెక్టర్లకు గాను జనరల్ స్థానాలు ఐదుగురు, మహిళాస్థానాలు రెండుకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవం చేసేందుకు సొసైటీ సభ్యులు కసరత్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కామేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మద్దిగూడెం స్టేజీ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జోగ్గూడెం గ్రామానికి చెందిన జర్పుల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జర్పుల హరిదాస్ బైక్‌పై ఖమ్మం నుంచి తాళ్లగూడెం వైపు వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో హరిదాస్ కాలు విరగగా, లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలైనవి. స్థానికులు వెంటనే వైద్యం నిమిత్తం ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఈఈ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్ ఈఈ వెంకటరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల పంచాయతీరాజ్ ఈఈగా బాధ్యతలు చేపట్టిన గుర్రాల వెంకటరెడ్డి గురువారం జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బైబిల్ క్విజ్ పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని రమణగుట్టలో ఉన్న యావె సమాజ మందిరం 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం బైబిల్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. ముందుగా వార్షికోత్సవానికి హాజరైన ప్రొఫెసర్ డాక్టర్ జాన్ రాజ్ వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రత్నబాబు, ప్రసాద్, స్టీఫెన్ పాల్, బొజ్జా వివేక్, మొదుగు మోషే, రూప్‌లాల్, బాసిపగు ప్రసాద్, అంబోజీ జీవరత్నం, పాలడుగు జీవన్, డేవిడ్, అనిత, పావని, సునీత, సుజాత, స్వరూప, కళమ్మ, రూతు, రిబ్కా, ఎస్తేరు, సౌమ్య, సుధా తదితరులు పాల్గొన్నారు.

మాలధారుల ఇరుముడి

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో తిరుపతమ్మ మాలధారుల ఇరుముడి కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామశివారులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వాములు బొమ్మగాని సైదులు, వీరబాబు, దండగల వీరుప్పలి ఆధ్వర్యాన సుమారు 28 మంది తిరుపతమ్మ మాలాధారుల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

నేషనల్ సైన్స్ డే

ఖమ్మం సహకారనగర్: స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేషనల్ సైన్స్‌డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంబాయి పరిశోధన కేంద్రంలో సీనియర్ సైంటిస్టుగా విధులు పని చేస్తున్న రామనాథం ముత్యాల పలు సూచనలు చేశారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజిక్స్ అధ్యాపకులు ఎం.జగన్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి రమణారావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



రామనాథంను సన్మానిస్తున్న యాజమాన్యం

సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు





మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న సమ్మక్క-సారలమ్మ దేవాలయం వద్ద గురువారం భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. 35 ఏళ్ల నుంచి చిన్నం ఉప్పలమ్మ, వీరయ్య దంపతుల ఆధ్వర్యంలో దేవాలయం జాతరలకు నిర్వహిస్తున్నారు. మేడారం జాతరను పురస్కరించుకుని చుట్టుపక్కల డివిజన్లలోని ప్రజలు తమ మొక్కులను తీర్చుకున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

రైతులపై కాల్పులు దుర్మార్గం..



ఖమ్మంరూరల్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: గిట్టుబాటు ధర కోసం ఢిల్లీలో మహారైతు ఉద్యమం నిర్వహించిన రైతాంగంపై కాల్పులను నిరసిస్తూ మండలంలోని కాచిరాజుగూడెం, ఎం.వెంకటాయపాలెం గ్రామాల్లో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అఖిల పక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పంజాబ్ రైతుల పై పోలీసుల కాల్పులను నిరసిస్తూ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను ప్రజాపంథా ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలో పొట్టిశ్రీరాములు సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు పగిడికత్తుల రామదాసు, చిర్రా భిక్షం, దామళ్ల రామదాసు, హిరాలాల్, ఆనంద్, పెద్ద వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: ఢిల్లీలో రైతులపై కాల్పులు జరిపించి పంజాబ్ రైతు మృతికి కారణమైన ప్రధాని మోడీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. కూసుమంచి మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ, తెలుగుదేశం, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసనను వ్యక్తం చేశారు.

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన తెలిపారు. మండలంలోని తిమ్మక్కపేట, దమ్మాయిగూడెం గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాలలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న హర్యానా రైతులపై కాల్పులు జరిపడం దుర్మార్గమని, దేశం యావత్ రైతాంగం ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం నాయకులు తిమ్మిడి హనుమంతరావు, పిచ్చయ్య, రాగం రాజు, సుంచు ఎల్లయ్య బచ్చోడులో జరిగిన కార్యక్రమంలో న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, వీరస్వామి, బ్రహ్మచారి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులపై ఫాసిస్టు దాడిని ఖండించండి

ఖమ్మంవన్‌టౌన్: హర్యానా పంజాబ్ సరిహద్దుల్లో పోలీసులు ఫాసిస్టు హంతక స్వభావంతో అత్యంత కర్కశంగా కాల్పులు జరిపి పంజాబ్‌లోని బటిండా జిల్లా బాలన్ గ్రామానికి చెందిన శుభకరణ్ సింగ్‌ను పొట్టన పెట్టుకున్నారని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాల్పుల ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటకు ఎంఎస్‌పీ ఇవ్వాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తుందని, దానిని ఉపసంహరించుకోవాలని కోరారు.



నేలకొండపల్లిలో..



కూసుమంచిలో..



తిరుమలాయపాలెం: తిమ్మక్కపేటలో..